# సుధాకర్ రెడ్డిని పరామర్శించిన శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17:నంద్యాల వైసీపీ సీనియర్ నాయకుడు, వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేశం సుధాకర్ రెడ్డి బైక్‌పై ప్రయాణిస్తుండగా జరిగిన ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మరియు శిల్ప చారిటీస్ చైర్మన్ నాగిని రవి సింగారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.సుధాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు . త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీకి సుధాకర్ రెడ్డి చేసిన సేవలు విశేషమని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు అండగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17-శ్రీశైలం జలాలను సంరక్షించి రాయలసీమ సాగు, త్రాగునీటి హక్కులను కాపాడాలని కోరుతూ రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి జిల్లా కలెక్టర్ రాజకుమారి గారికి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమితి నాయకులతో కలిసి ఆయన సమావేశమై పలు అంశాలను వివరించారు.కేసీ కెనాల్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, బచావత్ ట్రిబ్యునల్ నిబంధనలు, రాష్ట్ర విభజన చట్టాన్ని పరిగణలోకి తీసుకుని తక్షణమే నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. రబి పంటల నేపథ్యంలో ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కుందూ పరివాహక ప్రాంతానికి అలగనూరు కాలువ ద్వారా త్రాగునీరు అందించాలని సూచించారు. శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు దిగువకు వెళ్లకుండా విద్యుత్ ఉత్పత్తి నిలిపి నీటిని సంరక్షించాలని కోరారు.ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని, కేసీ కెనాల్‌కు మరో తడవ నీటి విడుదల చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం--

### సీపీఐ నాయకుల విమర్శలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ రాజీలేని పోరాటాలను ఉధృతం చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు తెలిపారు. మంగళవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమితి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పాల్గొన్నారు.రామాంజనేయులు మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ యుద్ధాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని అన్నారు. ముడి చమురు, గ్యాస్ దిగుమతులు దెబ్బతింటే నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.రంగనాయుడు మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పేదలకు ఇంటి స్థలాలు, గృహనిర్మాణ సహాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలంగా పోటీ చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఏప్రిల్ 6, 7 తేదీల్లో నందికొట్కూరులో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆస్తి పన్ను బకాయిల వడ్డీకి 50 శాతం మాఫీ---

### మార్చి 31 వరకు వన్‌టైమ్ పథకం అమలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17-ప్రజలకు ఆర్థికంగా ఉపశమనం కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జి.ఓ. ఎంఎస్ నం.58 (తేదీ: 16-03-2026) ప్రకారం, ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలపై వన్‌టైమ్ స్కీమ్‌ను అమలు చేస్తూ వడ్డీలో 50 శాతం మాఫీ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఒ ప్రకటన లో తెలిపారు .ఈ పథకం కింద ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు ముందుగా అసలు పన్ను (ప్రిన్సిపల్ ట్యాక్స్) మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలి. దానిపై పేరుకుపోయిన వడ్డీలో సగం (50 శాతం ) మాఫీ చేయబడుతుంది. మిగిలిన 50 శాతం వడ్డీ మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. దీంతో పన్ను చెల్లింపుదారులకు గణనీయమైన భారం తగ్గనుంది.ఇటీవల కాలంలో పన్ను బకాయిలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఊరట కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో గృహాలు, వాణిజ్య భవనాలపై ఉన్న పన్ను బకాయిలను క్లియర్ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.ఈ వన్‌టైమ్ మాఫీ పథకం 31 మార్చి 2026 వరకు మాత్రమే అమల్లో ఉంటుందన్నారు . గడువు ముగిసిన తర్వాత ఎలాంటి మాఫీ వర్తించదని, పూర్తి వడ్డీతో పాటు జరిమానాలు కూడా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.కాబట్టి, బకాయిలు ఉన్న ఆస్తి యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ మొత్తంతోనే తమ పన్ను బకాయిలను క్లియర్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న సూచించారు . ముందస్తుగా చెల్లింపులు చేస్తే భవిష్యత్తులో అదనపు భారాన్ని తప్పించుకోవచ్చని తెలిపారు.



## వడదెబ్బ వల్ల ఒక్క మరణం కూడా సంభవించకూడదు

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మార్చి 16:- ఈసారి ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వడదెబ్బ వల్ల ఒక్క మరణం కూడా జిల్లాలో సంభవించకూడదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లాలో కొనసాగుతున్న ఎండల తీవ్రతను ఎదుర్కొనటానికి తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఏ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారో గూగుల్ షీట్‌లో పొందుపరిచి ఒక వారం లోపు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదు, లేత రంగు కాటన్ బట్టలు ధరించాలి, గొడుగు లేదా టోపీ వాడాలి,మజ్జిగ, నీళ్లు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, కళ్లు తిరగడం) కనిపిస్తే ఏం చేయాలో అనే అంశాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిని ఆదేశించారు. ఆసుపత్రులు మరియు పశుసంవర్ధక శాఖలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ (రాఖీల) ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, నిధుల కొరత ఉంటే వెంటనే సమకూర్చుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎండల పట్ల వృద్ధులు మరియు చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.తహశీల్దార్ కార్యాలయాలు, బస్టాండ్లు, మార్కెట్లు, మాల్స్, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ కర్నూలు, పత్తికొండ , ఆదోని ఆర్డీఓ లను ఆదేశించారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణ చికిత్స అందించాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. మనుషులకే కాకుండా పశువుల కోసం కూడా నీటి వసతి మరియు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతీ రోజూ నివేదికలు అందించాలని మరియు ఈ పనులన్నీ ఒక వారం లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.అన్న క్యాంటీన్ల వద్ద మధ్యాహ్నం సమయంలో నీడ కోసం షెడ్లు ఏర్పాటు చేయించాలని, మార్కెట్ ప్రాంతాల్లో గ్రీన్ షేడ్స్ ఏర్పాటు చేయాలని, మున్సిపల్ వర్కర్లకు క్యాప్‌లు పంపిణీ చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్ లో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ కొండయ్య, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ ఇంచార్జి అజయ్ కుమార్ , డి పి ఎం సురేష్ కుమార్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు..

# పదాల్లో పరమార్థం-అన్నమయ్యలో అపూర్వ వైచిత్రి : డా. శిరీష

శ్రీ తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్న భావ వైవిధ్యం అపూర్వమని ఎస్వీ యూనివర్సిటీ సంస్కృత విభాగ ఆచార్యులు డా. శిరీష తెలిపారు. భక్తి, శృంగారంతో పాటు నైతిక విలువలను అన్నమయ్య ఎంతో మధురంగా వ్యక్తం చేశారని చెప్పారు.తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి ఉత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా “అన్నమయ్య సంకీర్తనలు – భక్తి, శృంగార నైతిక విలువల సమన్వయం” అనే అంశంపై మాట్లాడిన డా. శిరీష, అన్నమయ్య కీర్తనలలో భక్తి మాత్రమే కాకుండా శృంగార సౌందర్యం, మానవీయ విలువలను కూడా ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఆయన పదాల్లో ఆధ్యాత్మికతతో పాటు జీవన సారాంశం దాగి ఉందని చెప్పారు. యువతలో భక్తి, నైతికత పెంపొందించడంలో అన్నమయ్య కీర్తనలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కీర్తనలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దేవస్థానం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు.సదస్సుకు అధ్యక్షత వహించిన ఎస్వీ ప్రాచ్య పరిశోధనా సంస్థ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గోవిందరాజు మాట్లాడుతూ, తాళ్లపాక అన్నమయ్యతో పాటు ఆయన వంశీకులు చేసిన సేవలు అమూల్యమని అన్నారు. వారి సాహిత్యం భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతిని కలిపిన గొప్ప సంపదగా నిలిచిందని తెలిపారు. ఈ సాహిత్యాన్ని “ఆంధ్ర వేదం”గా చెప్పవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఈ సంపదను అందించడం అవసరమని సూచించారు.హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ, అన్నమయ్య సంకీర్తనలు భక్తి, శృంగార, ఆధ్యాత్మిక అంశాలతో నిండి ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య సాహిత్యానికి ప్రత్యేకమైన శైలి ఉందని, అందులో ఆధ్యాత్మిక జ్ఞానం దాగి ఉందని తెలిపారు. శ్రీనివాసుడు ఎంత మహిమ గల దేవుడో, అన్నమయ్య అంతటి గొప్ప భక్తుడని అన్నారు.

# మాన్యశ్రీ కాన్సీరామ్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలి

### ప్రజా పరిరక్షణ సమితి నేతలు డిమాండ్

మాన్యశ్రీ కాన్సీరామ్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలి అని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె బలరాం గారు న్యాయవాది డిమాండ్ చేశారు.కాన్సీరామ్ గారు సామాజిక న్యాయం కోసం ఉద్యమించారు.బహుజనులను గ్రామస్థాయి నుంచి చైతన్యం చేసిన ఘనత కాన్సీరాం గారికి చెందుతుంది అని అన్నారు. బహుజనులను రాజకీయ నేతలుగా చూడాలని తన జీవితాన్ని త్యాగం చేశారు. తను ఎలాంటి పదవి లేకుండా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సైకిల్ యాత్ర చేసి ప్రజలను చైతన్యం చేసి ప్రజల ముందు నిజాయితీగా ఉండాలని ప్రజా సంక్షేమ కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి.తను బహుజనుల రాజకీయనేతలు గా ఎదగాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కుమారి మాయావతి గారిని రెండు సార్లు ముఖ్యమంత్రి పీఠం అప్పజెప్పిన గొప్ప వ్యక్తి అని ప్రజా పరిరక్షణ సమితి నేతలు అన్నారు.ప్రజాసేవకే తప్ప సంపాదనకు కాదు అని నిరూపించిన గొప్ప వ్యక్తి.బి ఎస్ పి పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు పొందే స్థాయికి,పార్టీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేశారు. భారతదేశం లో బహుజనుల రథసారథి మాన్యశ్రీ కాన్సీరామ్ గారికి భారతరత్న అవార్డు ఇవ్వాలి అని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె బలరాం గారు న్యాయవాది పిలుపు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అని ప్రజా పరిరక్షణ సమితి నేతలు పిలుపునిచ్చారు.

## శ్రీశైలం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17:శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. భద్రతా దృష్ట్యా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్లపై వాహనాలు నిలపరాదని ముందుగానే సూచనలు జారీ చేసినప్పటికీ, కొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేయడం వల్ల అంతరాయం ఏర్పడుతోంది.ఇలాంటి వాహనాలను టోయింగ్ వాహనాలతో తరలించి పార్కింగ్ ప్రదేశాలకు చేర్చుతున్నట్లు పోలీసులు తెలిపారు. భక్తులు తమ వాహనాలను రింగ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని సూచించారు.

## దివ్యాంగ క్రీడాకారుడు గౌతమ్ కు సత్కారం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17-:జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన నంద్యాల జిల్లా దివ్యాంగ క్రీడాకారుడు గౌతమ్‌ను ఐఎంఏ రాష్ట్ర నాయకులు ఘనంగా సత్కరించారు. ఈనెల 18 నుంచి 21 వరకు ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున గౌతమ్ పాల్గొననున్నాడు.స్థానిక మధుమణి సమావేశ భవనంలో డాక్టర్ రవి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, డాక్టర్ పి.ఎస్. శర్మ తదితరులు గౌతమ్‌కు శాలువా, జ్ఞాపిక అందజేసి అభినందించారు. డాక్టర్ బాలరాజు నగదు సహాయం కూడా అందించారు.ఈ సందర్భంగా దివ్యాంగులను అన్ని రంగాలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బాలరాజు పేర్కొన్నారు. గౌతమ్ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని డాక్టర్ రవి కృష్ణ ఆకాంక్షించారు.

# మైనార్టీ మహిళగా సేవ చేయడం గర్వకారణం--

### : మాబున్నిసా మున్సిపల్ ఛైర్ పర్సన్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 17:125 ఏళ్ల చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాల్టీకి తొలి ముస్లిం మైనార్టీ మహిళా ఛైర్‌పర్సన్‌గా సేవలందించడం గర్వకారణమని ఛైర్‌పర్సన్ మాబున్నిసా అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు నిర్వహించిన సన్మాన సభలో ఆమె మాట్లాడారు.తనను తొలి మైనార్టీ మహిళా ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకునేలా మార్గదర్శకత్వం వహించిన తమ రాజకీయ గురువు శిల్పా కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపాల్టీ అధికారులకు, కౌన్సిలర్లకు తమకు అందించిన సహకారం పట్ల ధన్యవాదాలు తెలిపారు.తమ పదవీకాలంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సుమారు 66 కోట్ల రూపాయల విలువైన పనులు చేపట్టామని, జనరల్ ఫండ్ ద్వారా 74 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. గత ఐదేళ్లలో వందల కోట్ల రూపాయలతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు.తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**